క్లుప్తంగా

ఏటూరునాగారం తహసీల్దార్‌గా లక్ష్మణ్



ఏటూరునాగారం: ఏటూరునాగారం తహసీల్దార్‌గా లక్ష్మణ్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సంజీవ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వాజేడులో పనిచేస్తున్న లక్ష్మణ్‌ను బదిలీ చేశారు.

వాజేడు తహసీల్దార్‌గా సర్వర్



వాజేడు: వాజేడు తహసీల్దార్‌గా పని చేస్తున్న గూడూరు లక్ష్మణ్ ఏటూరునాగారం మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వాజేడు డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సయ్యద్ సర్వర్‌ను ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు.

'కంటి వెలుగు' ప్రారంభం



వాజేడు: మండల పరిధిలోని ఆరుగుంటపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ శారద ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలను చేయించుకోవాలని ఎంపీపీ కోరారు.

బంగారం, నగదు చోరీ



వెంకటాపురం(కె): మండల పరిధిలని అప్పాలవారివీధిలో ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పాలవారి వీధిలో నివాసం ఉంటున్న కాక రాంబాబు అనే ఉపాధ్యాయుడు ఆదివారం ఇంటికి తాళం వేసి స్వగ్రామమైన బర్లగూడెం వెళ్లారు. కాగా సోమవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి బీరువ తాళాలు తీసి బీరువాలోని రూ.40 వేల విలువ చేసే బంగారు నగలు, రూ.5 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ విషయంపై రాంబాబు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి రావు తెలిపారు.

ఆర్థిక సాయం



వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కొట్టె శివకుమార్, అనుశ్రీ తండ్రి సంజీవ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు, ఎస్ఎంసీ చైర్మన్ చీకూర్తి రమేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రూ.5 వేలు పిల్లలకు అందించి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పీడీ సంగు చేరాలు, ఉపాధ్యాయుడు ఫిరోజ్, కిరణ్‌కుమార్, సాంబయ్య, మహేష్, శ్రీనివాస్, రికార్డ్ అసిస్టెంట్ సత్యం పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన

పలిమెల: గొర్రెల పంపిణీ కార్యక్రమంపై మహదేవ్‌పూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పలి మెల, మహదేవ్‌పూర్ మండలాలకు చెందిన లబ్ధిదా రులకు, యాదవ సంఘం అధ్యక్షులకు, సర్పంచ్‌ల కు ఎంపీపీ కురసం బుచ్చక్క అధ్యక్షతన అధికారులు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గొర్ల పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులు వారి ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జి రాక్స్, బ్యాంకు అకౌంట్, కులం సర్టిఫికేట్ జతపర్చి పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, ఎంపీడీఓ చల్లా ప్రకాశ్‌రెడ్డి, జిల్లా వెటర్నరీ డాక్టర్, మండల పశు వైద్యాధికారి, సర్పంచ్ బొచ్చు శ్రీనివాస్, యాదవ సంఘం అధ్యక్షుడు మౌతి కిష్టయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దెముత్తారం వద్ద తనిఖీ చేస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రేగొండ మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్ పట్టెం శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది ఏఎస్సై ఈశ్వరయ్య, లాల్‌సింగ్, లింగన్న పాల్గొన్నారు.

ప్లీనరీ సమావేశానికి తరలిరావాలి



ములుగు: మాట్లాడుతున్న బాదం ప్రవీణ్‌కుమార్



ఎస్ఎస్ తాడ్వాయి: పార్టీ జెండాలను పంపిణీ చేస్తున్న రజినీకర్‌రెడ్డి



వెంకటాపురం(కె): మాట్లాడుతున్న రమణ

ములుగు: ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నేడు(మంగళవారం) జిల్లాకేంద్రంలో నిర్వహించతలపెట్టిన నియోజకవర్గ స్థాయి ప్లీనరీకి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో నియోజకవర్గ అధ్యక్షుడు కుసుమ జగదీశ్ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఉదయం 8గంటలకు ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు డప్పు చప్పుళ్లు, వాయిద్యాల నడుమ జెండా ఆవిష్కరణ చేసుకోవాలని అన్నారు. అనంతరం గట్టమ్మ ఆలయం నుంచి లీలాగార్డెన్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని అన్నారు. తర్వాత పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుసుమ జగదీశ్ జెండా ఆవిష్కరిస్తారని అన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్, ఆత్మీయ సమ్మేళన ఇన్‌చార్జ్ అరికెల నర్సారెడ్డిలు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్‌రాంనాయక్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోగిల మహేష్, ఆత్మ చైర్మన్ చందా చక్రపాణి, సానికొమ్ము రమేశ్‌రెడ్డి, జన్నారపు శ్రీను, బైకాని సాగర్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: జిల్లా కేంద్రంలో నేడు(మంగళవారం) బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభకు కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ మండల ఉపాధ్యక్షుడు చల్లా రజినీకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిల ఆదేశాల మేరకు మండలంలోని లింగాల, బందాల గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని కార్యకర్తలను, నాయకులతో మండల ఉపాధ్యక్షుడు, లింగాల గ్రామ ఇన్‌చార్జ్ రజినికర్‌రెడ్డి, నాయకులతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. బందాల ఇన్‌చార్జ్ పత్తిగోపాల్‌రెడ్డి, నాయకులు సారయ్య, చంద్రయ్య, వెంకన్న, చేల లక్ష్మీ, చేల శివకుమార్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: బీఆర్ఎస్ జెండా పండుగను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ములుగులో జరిగే జెండా పండుగకు నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త ముడతపల్లి మోహన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ సలీం పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): గ్రామా గ్రామాన బీఆర్ఎస్ జెండాను ఎగురవేయాలని వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25 న భద్రచలంలో జరిగే నియోజకవర్గ ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, కార్యదర్శి శెట్టి మురళి, నాయకులు వేల్పూరి లక్ష్మీనారాయణ, బాలసాని వేణు, మద్దుకూరి ప్రసాద్, జాగర శాంతమూర్తి, గాందర్ల నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రజినీలత

ములుగు: టీఎస్‌కేసీ-టీఏఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రజినీలత సూచించారు. ఈ మేరకు టీఎస్‌కేసీ-టీఏఎస్కే తరుపున 21వ శతాబ్ది నైపుణ్యాలు అనే అంశంపై మూడు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ తరగతుల్లో భాగంగా తొలిరోజు రజినీలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ ద్వారా విద్యార్థులకు సమయ పాలన, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెపొందుతాయని అన్నారు. టీఏఎస్కే శిక్షణ నిపుణుడు ఇంద్రకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో స్థిర పడడానికి, ఉద్యోగ అవకాశాలకు బోధన ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, అకాడమిక్ కో ఆర్డినేటర్ వెంకన్న, మహేందర్, యాకూబ్, అధ్యాపకులు డాక్టర్ సమ్మయ్య, డాక్టర్ యుగెంధర్, డాక్టర్ ఉమాదేవి, విజిత, శంకర్, శ్రీనివాస్, చేరాలు, మౌలానా, రమా, నీల, మెంటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న రాజన్న

ములుగు: జిల్లా కేంద్రంలో నూతనంగా చేపడుతున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి రాజన్న పిలుపునిచ్చారు. సోమవారం సంఘం సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సంఘం సభ్యులు ఉన్నారు.

సెలవుల్లో అప్రమత్తత అవసరం



ప్రొగ్రెస్ కార్డులు అందజేస్తున్న సుదర్శన్

వెంకటాపురం(కె): వేసవి సెలవుల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఏఎంఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాల, ఎంపీపీఎస్ తానిపర్తి పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవల్లో సమయం వృథా చేయకుండా సైన్స్ బొమ్మలు, పటాలుపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పోగ్రెస్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుజాత, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

కమిటీ ఎన్నిక



ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మైస నరేష్, ఉపాధ్యక్షులుగా కాడపాక నవీన్, కల్లెపు సతీష్, ప్రధాన కార్యదర్శిగా గుర్రం సుమన్, అదనపు కార్యదర్శిగా రామంచ వేణు, కోశాధికారిగా మైస కృపాకర్, ప్రచార కార్యదర్శిగా పసుల నవీన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కల్లెపు ప్రశాంత్, గౌరవ సలహాదారుడిగా మైస భిక్షపతి ఎన్నికయ్యారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు, గ్రామ పెద్దలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గౌడ కులస్తులు ఎల్లమ్మ బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపం, ఘటంకుండ, ఏడంత్రాల బోనాలను శివసత్తులు తలపై పెట్టుకొని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. కుల పెద్ద మనుషులు తాళ్లపెల్లి వెంకటస్వామి, గడ్డం రాజమౌళి, రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ కూనూరు అశోక్, కుల సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేందర్, ఉపాధ్యక్షుడు గడ్డం మహేష్ ఆధ్వర్యంలో పండుగను ఘనంగా నిర్వహించారు. రాత్రి అంతా కూడా ఆలయంలో జాగారం చేపట్టి ఎల్లమ్మ కథలను ఆలపిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. మోడెం రమేష్, గడ్డం కొండల్, తాళ్లపెల్లి మోహన్, సప్పిడి రాము, గడ్డం సదానందం, జీ. సదానందం, వినయ్, సునీల్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కాటారం: మండలంలోని పరికిపల్లి, ఆదివారంపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ సీఐ ప్రశాంతి ఆధ్వర్యంలో ఎస్సై గంగాధర్, సిబ్బంది దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. 5 లీటర్ల గుడుంబాను స్వాధీపర్చుకొని సుమారు 300 లీటర్ల బెల్లంపానకంను పారబోసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారికి పాల్పడుతున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గుడుంబా తయారీ, సరఫరా, విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: గుడుంబా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎస్సై శ్రీధర్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ములకలపల్లి చిన్నవాగు పరిసరాల్లో గుడుంబా కాస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్యే వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. వైస్ ఎంపీపీ భాస్కర్, బోట నాగేష్, చిలకమ్మ, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

జేపీఎస్‌ల పోస్టు కార్డు ఉద్యమం



పోస్టుకార్డు ఉద్యమంలో పంచాయతీ కార్యదర్శులు

వెంకటాపురం(కె): తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులను రాసినట్లు తెలిపారు. సంజీవరావు, సురేష్, జనార్ధన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ

చిట్యాల: మండలంలోని జూకల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవతరగతి పూర్తి చేసి, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుపేద విద్యార్థులకు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలను పాఠశాల ఉపాధ్యాయురాలు, ఫౌండేషన్ సభ్యులు మారం స్వరూప ద్వారా సోమవారం అందించారు. నిరుపేదల కోసం ఫౌండేషన్ సభ్యులు ప్రతి నెల తమకి తోచిన సహాయం అందిస్తున్నారని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాధిక, మమత, స్వరూప, వీణావానీ,మాధవి, రంజిత్, రఫీ,యోగానంద,చారి, సాంబారాజు లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుపేద విద్యార్థులకు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ సోమవారం అందజేశారు.

పెన్షన్ పెంచేంత వరకు పోరాటం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ములుగు: దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేల చొప్పున పెన్షన్ పెంచేంత వరకు పోరాటం కొనసాగిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ జన్ను రవి మాదిగ అన్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని షెడ్యుల్ క్యాస్ట్ కో ఆపరేటీవ్ సొసైటీ దుకాణ సముదాయం ఎదుట సోమవారం రాజ్యాధికార చైతన్య కరపత్రాన్ని సంఘం నాయకులు, మద్దతుదారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మంచోజు చంద్రమౌళీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జన్ను రవి మాట్లాడుతూ.. రాజ్యాధికారమే లక్ష్యంగా దివ్యాంగుల పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోర జాతీయ నాయకుడు నెమలి నర్సయ్య మాదిగ, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి కొడారి సాంబయ్య, ఎమ్మెస్పీ నాయకులు కల్లేపల్లి రమేశ్‌మాదిగ, మరాఠి రవీందర్‌మాదిగ, వీహెచ్‌పీఎస్ నాయకులు దేవేందర్‌యాదవ్, బెజ్జంకి రాధకృష్ణ, ఆకారపు వేణు, యాంపాటి శ్రీనుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జాతరకు సౌకర్యాలు కల్పించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, నాయకులు

వెంకటాపురం(ఎం): మండలంలోని రామాంజాపూర్ గ్రామ శివారులో నిర్వహించే ఎరుకల నాంచారమ్మ జాతరకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్యాకు ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు, తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి భిక్షపతి వినతిపత్రం అందించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఎస్టిమేషన్ వేయాలని ఏఈ పూర్ణచందర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం జాతర వాల్‌పోస్టర్‌ను కలెక్టర్‌చే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లకొండ భాస్కర్, కేతిరి రాజు, రమేష్, సురేష్, గంగయ్య, సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం: మండలంలోని గోగుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోగుపల్లి, శివాపురం , లింగాపూర్ గ్రామాలకు చెందిన రైతులు ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గతంలో ఇక్కడ ఉన్న పీఏసీఎస్ సహకార సంఘం కొనుగోలు కేంద్రాన్ని రద్దు చేయడం వల్ల ధాన్యం విక్రయాలు జరగడం లేదన్నారు. కల్లాల వద్ద ఆరబోసుకుంటే వర్షాల వల్ల ధాన్యం దెబ్బతింటుందని, కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, డైరెక్టర్ వంగపండ్ల రవి, శేఖర్ రెడ్డి, వసంత శ్రీనిఆవస్, ప్రశాంత్, నవీన్, పెద్ది రాజబాబు, సంపత్, మాదరి అశోక్ పాల్గొన్నారు.

మావోయిస్టుల సమాచారం ఇవ్వండి



వాజేడు: వాల్ పోస్టర్లను అతికిస్తున్న పోలీసులు



వెంకటాపురం(కె)లో..

వాజేడు: మావోయిస్టులకు సంబంధించి ఎలాంటి విషయం తెలిసిన తమకు సమాచారం ఇవ్వాలని పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపారు. మండల పరిధిలోని పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో సోమవారం మావోయిస్టుల ఫొటోలతో ఉన్న మాకు సమాచారం మీకు బహుమతి వాల్ పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోకి మావోయిస్టులను రానివ్వొద్దని అలాంటి వారు కనిపించగానే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

'సమాచారం మాకు.. బహుమతి మీకు'

వెంకటాపురం(కె): మావోయిస్టుల సమాచారం ఇవ్వండి బహుమతి పొందండి అంటూ మండలంలో మావోయిస్టుల ఫొటోలతో కూడిన పోస్టర్లను పోలీసులు సోమవారం మండలంలో గోడలకు అంటించారు. ఈ పోస్టర్లను మండల పరిధిలోని సూరవీడు, ఆలుబాక, ఎదిర, నూగూరు గ్రామాల్లో వేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం ఎస్సై తిరుపతి రావు, సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు వడ్కాపురం సారయ్య అన్నారు. సోమవారం మండలంలోని గోగుపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఆరబోసిన ధాన్యం పరిశీలించి రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నబోయినపల్లి, శివాపురం, గోగుపల్లి, షాపెల్లి ,దొడ్ల, మల్యాల, కొండాయి, రొయ్యూర్, రామన్నగూడెం తదితర గ్రామాల్లో 20 రోజులుగా వరికోతలు ప్రారంభం అయినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ప్రారంభించలేదన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యాన్ని రైతులు కాపాడుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్నారు. శివాపురం గ్రామంలో రద్దు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి యాకూబ్, ఎలకపెల్లి శ్రీనివాస్, రైతులు పూనం స్వామి, రాజు, మధుసూదన్‌రెడ్డి, సారయ్య, శేఖర్, బద్రి పాల్గొన్నారు.